జాషువా, భగత్‌సింగ్‌ల స్ఫూర్తి కొనసాగాలి

మదనపల్లె సిటీ : జాషువా, భగత్‌సింగ్‌ల స్ఫూర్తిని కొనసాగించడమే సిసలైన దేశభక్తి అని వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ స్పష్టం చేశారు. నవయుగ కవిచక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా, స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్‌ల జయంతిని పురస్కరించుకుని గురువారం బాస్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తొలుత వారి చిత్ర పటాల వద్ద నివాళులు అర్పించారు. సాహిత్యరంగంలో జాషువా విశేషమైన కృషి చేశారన్నారు. భగత్‌సింగ్ స్వాతంత్య్ర సమరంలో విప్లవించిన వేగుచుక్కగా అభివర్ణించారు. కార్యక్రమంలో రిటైర్డు ఏఎస్పీ పెద్దయ్య, వీసీకే నాయకులు నీరుగట్టి రమణ, బయన్న, సూర్య, పవన్‌తేజ, రెడ్డప్ప, రవిశంకర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె : జాషువా, భగత్‌సింగ్‌లకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


పీలేరు : భగత్ సింగ్ చిత్రపటం వద్ద ఎన్‌ఎస్‌యూఐ నాయకుల నివాళి


పీలేరు : సమావేశంలో మాట్లాడుతున్న కవి మురళీధర్‌రాజు


వాల్మీకిపురం : భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాల వద్ద నివాళి దృశ్యం

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

పీలేరు రూరల్ : స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ 116వ జయంతిని ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్‌తేజ మాట్లాడుతూ తెల్లదొరల నుంచి దేశానికి విముక్తి కల్పించి, స్వాతంత్య్రం సాధించడంలో తనదైన శైలిలో పోరాడి ఉరికొయ్యను ముద్దాడిన మహోన్నత వ్యక్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాయి సంపత్‌కుమార్, మహేష్, అఖిల్, అమర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నవయుగ కవి చక్రవర్తి బిరుదాంకితుడు గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవులు మురళీధర్ రాజు, శ్రీరాములు రాజు మాట్లాడుతూ గుర్రం జాషు సాహిత్యం సంఘంలోని ప్రతి వ్యక్తిని చైతన్యవంతున్ని చేయడానికి దోహదం చేసిందన్నారు. ఆయన తన బాల్యంలో పేదరికం, అంటరానితనంతో ఎదుర్కొన్న దుర్భర జీవితం తన సాహిత్యానికి మూలమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రేవతి, డిగ్రీ కళాశాల అధ్యాపకులు బాలాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి

వాల్మీకిపురం : విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతిని, నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుచరణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ 14 ఏళ్లకే స్వాతంత్య్ర సంగ్రామంలో అడుగుపెట్టి బ్రిటీషర్లపై తిరుగుబాటు చేసి 23ఏళ్లకే దేశం కోసం ప్రాణాలర్పించాడన్నారు. గుర్రం జాషువా ఎనిమిది నాటకాలు, మూడు నవలలు, పద్యకావ్యాలు, ఏడు ఖండ కావ్యాలు రచించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, వైస్ ప్రిన్సిపల్ ఫర్హత్ కౌసర్, ఉపాధ్యాయులు రామలక్ష్మమ్మ, ధనలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువణ్ణామలైకి వెళ్లిన బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమి పురస్కరించుకుని మదనపల్లె వన్,టు డిపోల నుంచి గురువారం తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు వెళ్లాయి. వన్ డిపో నుంచి నాలుగు, టు డిపో నుంచి నాలుగు అల్ట్రాడీలక్స్ బస్సులు వెళ్లినట్లు డీఎంలు మూరే వెంకటరమణారెడ్డి, ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు.


తిరువణ్ణామలైకి బయలుదేరుతున్న బస్సులు

అరుణాచలానికి తరలివెళ్లిన ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని పీలేరు నుంచి అరుణాచలానికి మూడు ప్రత్యేక బస్సు సర్వీసులు తరలి వెళ్లాయి. గురువారం ఉదయం స్థానిక బస్టాండులో బస్సులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి భక్తుల కోసం పీలేరు డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, స్టేషన్ మేనేజర్ బాబునాయక్, ఏడీసీ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని మూరేవాండ్లపల్లికి చెందిన రాజా రెడ్డికి రూ.2లక్షలు, పట్టణానికి చెందిన నాగవెంకటేష్‌కు రూ.5లక్షలు సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ కలీమ్, కేశవరెడ్డి, మహబూబ్‌బాషా, శ్రీధర్ రాయల్, ఆనంద, సైపుల్లా, సందాని, ఇబ్రహీం, బబ్లూ, అష్రఫ్ పాల్గొన్నారు.


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఘనంగా వినాయకుడి నిమజ్జనం


నిమజ్జనానికి తరలిన వినాయకుడు


గణేష్ విగ్రహం వద్ద భక్తులు

వాల్మీకిపురం : స్థానిక తోటవీధి, జెట్టిపాళ్యెం వీధి, ఎన్టీఆర్ కాలనీ, కొత్తపేటవీధి, తదితర ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను గురువారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అలంకరించిన పల్లకీలో గణేషుని విగ్రహాలను ఏర్పాటు చేసి పుర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం పట్టణ శివారు ప్రాంతంలోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక విగ్రహ కమిటీ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ బాటహరిజనవాడలో గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పది రోజుల క్రితం గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి రోజూ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం గణేష్ విగ్రహాన్ని చాందినిబండిలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రేపు కలికిరిలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

కలికిరి : రాజంపేట పార్లమెంటు సభ్యుడు పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం మండలంలో పర్యటిస్తారని మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం కలికిరి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగే మండల స్థాయి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో పాల్గొని పర్యవేక్షిస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పత్తేగడ గ్రామంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌ను పరిశీలిస్తారన్నారు. పాళెం వద్ద ఉన్న పర్యాటకశాఖ కల్యాణ మండపం ఆవరణలో ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారని వివరించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

రేబిస్ వ్యాధి నివారణపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసులు

మదనపల్లె : రేబిస్(కుక్క కాటు వలన సంక్రమించే వ్యాధి) నివారణపై ప్రజలు విస్తృత అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జిల్లా మెడికల్ కాలేజీ సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవీవరప్రసాద్, బయో కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ రేబీస్ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల విద్యార్థులకు రేబీస్ వ్యాధి వ్యాప్తి, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిచ్చికుక్క కరిచిన వారు మరింత అప్రమత్తంగా చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి నర్సు రెడ్డి రాణి, హాస్టల్ వార్డన్లు పద్మావతి, స్వర్ణలత, మున్సిపల్ డీఈ శిరీష పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి


పాతూరులో మిలాద్ ఉన్ నబి జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు


వాల్మీకిపురం : మిలాద్ ఉన్ నబీ బ్యానర్లతో ముస్లిం యువత

పెద్దమండ్యం : మండలంలోని ఎన్‌ఓపల్లె పంచాయతీ కలిచెర్ల పాతూరులో మిలాద్ ఉన్ నబి కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాతూరు కూడలిలో జెండాను ఆవిష్కరించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే పాతూరు పురవీధులలో మిలాద్ ఉన్ నబి జెండాను ఊరేగించారు. జెండా ఆవిష్కరించి గంధం, ఫాతెహా జరిపి ప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే పెద్దమండ్యం పాతూరు జెండా మాను వద్ద మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మైనార్టీ సంఘం నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నజీర్‌అహ్మద్, ముతవల్లీ గౌస్‌పీరా, ఫయాజ్, గౌస్‌బాషా, జాఫర్‌బాషా, సాదిక్‌అలీ, ఆర్‌బీకే చైర్మన్ చాను, పెద్దమండ్యం గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, మైనార్టీ నాయకులు బాబాబేగ్, ఖాదర్‌ఖాన్, గౌస్, చాను పాల్గొన్నారు.

వైభవంగా ఈద్ మీలాద్ జులూస్

వాల్మీకిపురం : మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం వాల్మీకిపురంలో ముస్లింలు ఈద్ మిలాద్ జులూస్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మీలాద్ ఉన్ నబీ జెండాలు, బ్యానర్లు చేత పట్టుకొని, బ్యాడ్జీలు, కండువాలు ధరించి నినాదాలు చేస్తూ పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనతో ధార్మిక శోభ కనిపించింది. అలాగే స్థానిక నాయక్‌వీధి పీర్ల చావిడిలో ఆసారే షరీఫ్ ప్రదర్శనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నాయక్‌వీధి, కోనేటివీధి, హసన్ ఖాన్ వీధి, మక్కా మసీదు వీధుల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే మహమ్మద్ ప్రవక్త పవిత్ర జీవిత చరిత్రను కొనియాడుతూ భక్తిగీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముతవల్లీలు, ఇమామ్‌లు, మత పెద్దలు, ముస్లిం యువత పాల్గొన్నారు.

నేడు జల్సా–ఏ–మిలాద్–ఉన్–నబి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఉన్న బడేమకాన్‌లోని దర్గాలో శుక్రవారం జల్సా–ఏ–మీలాద్–ఉన్–నబి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్గా మకాన్‌దార్ సయ్యద్‌హాషిం తెలిపారు. రాత్రి 9 గంటలకు దర్గా ఆవరణంలో ఆసారే షరీఫ్ (కేశ ప్రదర్శన) కార్యక్రమం జరుగుతుందన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె : మండలంలోని ముస్లింలు గురువారం మహ్మద్‌ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త ప్రవచించిన విశ్వశాంతి, ప్రేమ, ఐక్యత, సందేశాన్ని అందరూ అలవర్చుకుని సోదరభావంతో మెలగాలన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : రామసముద్రం మండలంలో ముస్లింలు గురువారం మిలాద్ ఉన్ నబీ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా రామసముద్రం మండలం దిన్నిపల్లె సమీపంలో ఉన్న హజ్రత్ మన్‌ఫీర్ సయ్యద్‌మస్తాన్‌షాఖాద్రీ దర్గాలో మహ్మద్‌ప్రవక్త పవిత్ర జ్ఞాపికలకు గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మైసూర్ నుంచి వచ్చిన పీఠాధిపతి హజ్రత్‌మాన్‌ఫీ సయ్యద్ బృహన్‌షా ఖాదరీ మహ్మద్ ప్రవక్త పవిత్ర జ్ఞాపికలకు ప్రత్యేక ఫాతెహా చేశారు. మన్‌ఫీర్‌సయ్యద్‌గౌస్‌షాఖాదరీ, పీఠాధిపతి సోదరులు, కుటుంబీకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు

రామసముద్రం : రామసముద్రం మండలం దిన్నిపల్లి సమీపంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో వాసు, తేజశ్రీ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పీడీ ఇందిర, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ ఇందిర

నేడు ఏపీఎండీసీలో ఉచిత వైద్య శిబిరం

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఆరోగ్యకేంద్రంలో నేడు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిచనున్నట్లు ఆద్య మెడికల్ సర్వీసెస్ మేనేజర్ అశోక్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యశిబిరంలో ఎముకలు, జ్వరం తదితర వ్యాధులకు సంబంధించి తిరుపతి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు చెందిన వైద్యులచే సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారి పంచలోహ విగ్రహం వితరణ


మారమ్మను పురవీధులలో ఊరేగిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో వెలసిన మారమ్మకు గురువారం పుల్లంపేట వైస్ ఎంపీపీ బోగా వెంకటరత్నమ్మ, భర్త బోగా వెంకటరామయ్య దంపతులు రూ. 1 లక్షలు విలువజేసే అమ్మవారి విగ్రహాన్ని ఆలయానికి అందించారు. అనంతరం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో వేదపండితులుచే హోమం నిర్వహించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

మదనపల్లె సిటీ : స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. అక్టోబర్ 3న అడ్మిషన్లు జరుగుతాయన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిప్లొమా కోర్సుల్లో చేరే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలేజీలో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని దీనికి పాలిసెట్–23 ప్రవేశపరీక్ష రాసి క్వాలిఫై అయి కూడా కౌన్సెలింగ్‌కు రానివారు, ప్రవేశ పరీక్షలో అర్హత సాధించనివారు, దరఖాస్తు చేసి పరీక్షకు హాజరుకానివారు, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులంతా అర్హులన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర వాలీబాల్ పోటీలకు ఇద్దరు బాలికల ఎంపిక


పల్లవి


హేమలత

తంబళ్లపల్లె : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలం నుంచి ఇద్దరు బాలికలు ఎంపికైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. గోపిదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లవి, 10వ తరగతి విద్యార్థిని హేమలత అండర్–17 బాలికల విభాగంలో తిరుపతి దుర్గసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పీడీ ఈశ్వరమ్మ సూచనల మేరకు ఆటలలో రాణిస్తూ బాగా చదువుతున్న ఆ బాలికలను సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గురువురెడ్డి అభినందించారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

నిమ్మనపల్లె : నిమ్మనపల్లెలో ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశిబిరం జరుగుతుందన్నారు. నిమ్మనపల్లె–2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష సర్వేలు నమోదు చేసుకుని వైద్య చికిత్సలు అవసరం ఉన్నవారికి చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. నమోదు చేసుకున్నవారు శిబిరానికి హాజరు కావాలని కోరారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగులు వితరణ


గొడుగు వితరణ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పీలేరు : పీలేరు పట్టణంలో ఫుట్‌పాత్ వ్యాపారులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్రరెడ్డి, సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎండకు, వానకు రక్షణగా ఉండేందుకు తమవంతు సాయంగా గొడుగులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శశిధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, జయచంద్రనాయుడు, రెడ్డిరవి, పి. మహేష్, ఎం. మహేష్, అశోక్, సుధీర్, నాగబాలాజి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా సలీంబాషా


సలీంబాషా


వేణుగోపాల్‌రెడ్డి

బి.కొత్తకోట : భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.సలీంబాషా, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షునిగా వేణుగోపాల్ రెడ్డి ఎన్నికైనట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటిలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లోని క్లెయిమ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పండిత పరిషత్తు నూతన కార్యవర్గం

రాయచోటి అర్బన్ : రాష్ట్రీయ పండిత పరిషత్తు అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎంపికకు రాష్ట్రీయ పండిత పరిషత్తు అధ్యక్షుడు కె.రమణయ్య, రాష్ట్ర బాధ్యుడు గంగనపల్లె వెంకటరమణలు పరిశీలకులు వ్యవహరించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా టి.క్రిష్టారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మైనుద్దీన్, గౌరవాధ్యక్షుడిగా కె.రామచంద్రారెడ్డి, కోశాధికారిగా గంగాధర్ రెడ్డిలు ఎన్నికయ్యారు. సహాధ్యక్షులుగా శివశంకరయ్య, రామ్మోహన్, సుధాకరరాజు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా నరేంద్ర, సుబ్బరామరాజు, భాస్కరయ్య, ఉపాధ్యక్షులుగా మాబు హుస్సేన్, డి.శివశంకరయ్య, బి.నరసింహులు, మహిళా కార్యదర్శులుగా శృతి, సుభాషిణిలు, కార్యదర్శులుగా వెంకటరమణారెడ్డి, ఎం.శంకర్ నాయక్, ఓబులరెడ్డిలను ఎన్నుకున్నారు.

హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

రాయచోటి అర్బన్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను ఉపసంచాలకులు జాకీర్‌హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహం, బాలుర వసతి గృహం నం.1లను పరిశీలించారు. విద్యార్థుల దినచర్యలను పరిశీలించి వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. క్రమశిక్షణతో విద్యపై అభ్యసించాలంటూ సూచించారు. 100 శాతం విద్యార్థుల బయోమెట్రిక్ నమోదయ్యేలా వసతిగృహ సంక్షేమాధికారులను ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వసతి గృహ సంక్షేమాధికారులు హరి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షునిగా కృష్ణప్ప



మదనపల్లె సిటీ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన సీపీఐ నాయకుడు కృష్ణప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాపట్లలో జరిగిన 22వ రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం తరపున పోరాటాలు చేస్తామన్నారు.

పార్టీ బలోపేతానికి గ్రామాల పర్యటన

బి.కొత్తకోట : మండలంలో బీజేపి బలోపేతం కోసం గ్రామాల్లో పర్యటిస్తున్నట్టు ఆ పార్టీ సహకార విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం బి.కొత్తకోటలో పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర్వాత మండలంలో పర్యటించి బూత్ కమిటీలను నియమిస్తామన్నారు. సమావేశంలో ఎన్.శోభారాణి, గోరంట్ల రమేష్, శంకరమూర్తి, ఫరీద్‌బాబు, వెంకటనారాయణ, బాషా సాహెబ్, నాగరాజు, చలపతి, ముకుంద, మురళీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం పంపిణీ


నగదు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని పెద్ద కాలువ గడ్డ వీధికి చెందిన పూలశెట్టి రమేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యం గురువారం ఎంపీపీ మహమూద్, సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చంద్రశేఖర్‌లు సచివాలయ సిబ్బందితో కలసి మృతుడి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


డ్రైవర్లకు సూచనలిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు : ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులో లగేజీ ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు అన్ని రికార్డులు కలిగి ఉండాలని ఆదేశించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.